మియాపూర్ టవర్స్‌లో...

కొండాపూర్‌లోని పోలీస్ బెటాలియన్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

రెయిన్‌బో విస్తాస్ రాక్ గార్డెన్‌లో..

గచ్చిబౌలి జీపీఆర్ఏ క్యాంపస్‌లో..

ఉత్సాహంగా హోలీ సంబురాలు

మియాపూర్/కొండాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: నియోజకవర్గంలో హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, మహిళలు, పురుషులు వేడుకలలో పాల్గొని రంగులు చల్లుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పారిశుద్ధ్య కార్మికులు, చిన్నారులతో కలిసి హోలీ వేడుకలలో పాల్గొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కాముని దహనం చేశారు. అనంతరం హోలీ వేడుకలను జరుపుకున్నారు.

– కొండాపూర్ : కొండాపూర్, చందానగర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో హోలీ సంబురాలు సందడిగా సాగాయి. చిన్న, పెద్ద అందరూ పాల్గొని ప్రేమానురాగాలతో రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి, బాలాజీ నగర్, కేపీహెచ్‌బీ కాలనీలలో హోలీ సంబరాలు జరిగాయి. మలేషియన్ టౌన్షిప్, రెయిన్బో విస్తాస్ రాక్ గార్డెన్.. లాంటి గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో హోలీ సంబురాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. ఆటపాటలతో సందడి చేశారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కాముని దహనంలో స్థానికులు

ప్రేమ్‌నగర్‌కాలనీలో హోలీ వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు

రెయిన్‌బో విస్తాస్ రాక్ గార్డెన్‌లో హోలీ సంబురాలు

హోలీ వేడుకల్లో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

గచ్చిబౌలి జీపీఆర్ఏ క్యాంపస్‌లో..

గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: కేపీహెచ్‌బీ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో గంజా యి విక్రయానికి యత్నించిన ఇద్దరిని కొనుగోలు చేయడానికి వచ్చిన నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద 1360 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సెక్టార్ ఎస్సై మౌనిక రెడ్డి తెలిపిన ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీలోని హిందూ ఫార్చ్యూన్ ఫీల్డ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ పక్కన నిర్మాణ ప్రదేశంలో కొందరు వ్యక్తులు గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారిలో నగరానికి చెందిన తూముల ఆశిశ్‌కుమార్, (29), సాత్విక్ (20) వద్ద బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఓ జి. కుష్(హైడ్రో పోనిక్) గంజాయితోపాటు సాధారణ గంజాయిని, రూ.7500 నగదును గుర్తించారు. గతంలో ముంబైలో నివసించే ఆశిష్ కుమార్ గంజాయికి అలవాటు పడ్డాడు. ఓజి కుష్ గంజాయి 1 గ్రాముకు రూ.3000 పలుకుతుంది. ఓ జి కుష్ గంజాయికి హైదరాబాద్ నగరంలో మంచి డిమాండ్ ఉందని గమనించి గతంలో నగరానికి వచ్చి విక్రయించే క్రమంలో పోలీసులకు చిక్కి అరెస్టు అయ్యాడు. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. తండ్రి హైదరాబాద్ నగరానికి బదిలీ కావడంతో ఇక్కడే స్థిరపడ్డ ఆశిష్ కుమార్ ముంబైలో తనకున్న పరిచయాలతో మళ్లీ గంజాయి విక్రయించే పనులను చేపట్టాడు. ఈనెల 10న తన స్నేహితుడైన సాత్విక్‌ను ముంబైకి పంపించి అక్కడ రిషికేష్ అనే వ్యక్తిని కలిసి.. రూ.2.50 లక్షలు చెల్లించి 260 గ్రాములు ఓ జి కుష్ గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చాడు. దీనిని విక్రయించే క్రమంలో ఈనెల 12న కేపీహెచ్‌బీ కాలనీకి చేరుకున్నారు. మణికొండ లో నివాసముండే సాత్విక్ స్నేహితులు. పేరాల రాహుల్(20), పేరాల ప్రత్యూష్ (24), అబ్రార్ ఖాన్(23), జై బుడ్డోలే (20) లకు గంజాయిని విక్రయించే క్రమంలో పోలీసులకు చిక్కారు. వారి వద్ద 260 గ్రాముల ఓ జి కుష్ గంజాయి, 1100 గ్రాములు సాధారణ గంజాయి కలిపి 1360 గ్రాములు గంజాయిని రూ.7500 నగదును, 6 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్, మార్చి 14: ఫీడర్ మరమ్మతుల కారణంగా అల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఏ రాకేశ్‌గౌడ్ అన్నారు. ఇందులో భాగంగా 11 కేవీ హ్యుందాయ్ 2 ఫీడర్ పరిధిలోని మెరిడియన్ స్కూల్ సమీపం, ఎస్ కన్వెన్షన్ రోడ్డు మార్గం, బుట్ట కన్వెన్షన్ రోడ్డు సమీపంలోని ఎన్ఐఏ వరకు, సూర్య పేపర్ సమీపంలో నుంచి సలీం టీ స్టాల్ వరకు మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

చందానగర్ సబ్ స్టేషన్ పరిధిలో...

ఫీడర్ మరమ్మతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు ఏఈ దీప్తి తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలోని ప్రకాశ్‌నగర్, హఫీజ్‌పేట్ బ్రిడ్జి ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11 కేవీ మార్తాండనగర్ ఫీడర్ పరిధిలోని మార్తాండనగర్, న్యూ హఫీజ్ పెట్, హనీఫ్‌కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కేవీ ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలోని ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక్‌నగర్, ప్రకాశ్‌నగర్ వంటి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి 2:30 వరకు, 11 కేవీ గోల్డెన్ తులిప్ ఫీడర్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, గెలాక్సీ అపార్ట్మెంట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటల వరకు, 11 కేవీ హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని మదీనాగూడ ప్రధాన రహదారి ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటల వరకు, 11 కేవీ మార్కెట్ ఫీడర్ పరిధిలోని సీఎం తోట, నార్నె ఎస్టేట్స్, ప్రేమ్ నగర్ బి బ్లాక్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

దుండిగల్ పరిధిలో...

దుండిగల్, మార్చి14: విద్యుత్ ఫీడర్లలో తలెత్తిన మరమ్మతు పనుల కారణంగా నిజాంపేటలోని 33/11 కేవీ ప్రశాంతి హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ రాజు నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ న్యూ శ్రీనివాస కాలనీ, 11 కేవీ వజ్ర ఫీడర్, 11 కేవీ పాండురంగ ఫీడర్, 11 కేవీ ప్రశాంత్ హిల్స్ ఫీడర్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ ఏరియా, మధురానగర్ ఫేస్-1, 2, 3, శ్రీనివాసకాలనీ పార్క్ ఏరియా, సైదప్ప బస్తీ, శ్రీనివాస కాలనీ, బృందావన్ హిల్స్ కాలనీ, గ్రీన్ ఫీల్డ్, రాజధాని స్కూల్, బండారి లేఔట్‌లోని రోడ్ నంబర్ 10, 10ఏ, వజ్ర ప్రతీక్ అపార్ట్మెంట్ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు సమస్యను గుర్తించి తమతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: కూకట్‌పల్లిలో విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏఎస్‌రాజునగర్, శుభోదయ కాలనీ, వివేకానందనగర్, ఈనాడు కాలనీ, శాంతినగర్, ఎమ్మెల్యే గాంధీ నివాసం, కూకట్‌పల్లి శివాలయం రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ ధర్నా

- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. జీడిమెట్ల పీఎస్‌కు తరలింపు


కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తా వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు వాళ్ళ హరీశ్‌రావును ముందస్తు అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్, మార్చి 14: తెలంగాణ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడానికి నివసిస్తూ కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా జీడిమెట్ల పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండానే అమలు చేసినట్లు గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం తెలియజేయడం ప్రభుత్వ చేతగానితనాన్ని తెలియజేస్తుందన్నారు. ఆరు గారెంటీలను అమలుపరిచే దమ్ము, ధైర్యం లేక గవర్నర్ ప్రసంగం ద్వారా అమలు కానీ హామీలను అమలు పరిచామని అబద్ధాలు చెప్పడం పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఉందని, ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయడమంటే ప్రజా సమస్యలను వినే పరిస్థితిలో ప్రభుత్వం లేదనేది స్పష్టమవుతుందన్నారు. అనంతరం ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్ రాజు, డాక్టర్ హుస్సేన్, కమలాకర్, నరేందర్ రెడ్డి, ఎండి గౌస్, మక్సుద్ అలీ, సమ్మయ్య నేత, నదీమ్ రాయ్, ఇబ్రహీంఖాన్, గుబ్బల లక్ష్మీ నారాయణ, మూసాఖాన్, మసూద్, కార్తీక్ గౌడ్, సాజిద్, మహమ్మద్ యూసుఫ్, మెట్ల శ్రీను, శ్రీశైలం, ఏసు, నవాబ్, అల్లావుద్దీన్, జునైద్, బండ మహేందర్, కొండా శ్రీనివాస్, ఇస్మాయిల్, ఆసిఫ్,ప్రసాద్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు ముందస్తు అరెస్ట్

మాదాపూర్, మార్చి 14: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జరిగిన ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తే అధికార పార్టీ సస్పెన్షు విధించడాన్ని నిరసిస్తూ ధర్నాలు చేసేందుకు వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు వాలా హరీశ్‌రావును మియాపూర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

ఇఫ్తార్ విందు

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సప్తర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందుకు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు మమ్మద్ గౌసుద్దీన్ పాల్గొన్నారు. – అల్లాపూర్, మార్చి 14

రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

సూరారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్

దుండిగల్, మార్చి14: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన దౌర్భాగ్యపు వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సూరారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం రేవంత్‌రెడ్డికి తగదన్నారు. కనీసం ఆయన కూర్చున్న సీటుకైనా మర్యాద ఇవ్వాలని, దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని హితవుపలికారు. పాలన చేతగాక తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే సీఎం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. పాలన పగ్గాలు చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా ఏ ఒక్క కార్యక్రమాన్ని ఆయన సరిగా పూర్తి చేయలేదని విమర్శించారు.

ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా మట్టిపోస్తున్న టిప్పర్ డ్రైవర్‌పై కేసు

కుత్బుల్లాపూర్, మార్చి14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి ఫాక్స్ సాగర్ చెరువు, ఎఫ్‌టీఎల్ స్థలంలో ఇటీవల కొంతమంది వ్యక్తులు టిప్పర్లతో మట్టిపోస్తూ చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు శుక్రవారం పేట్ బషీరాబాద్ పోలీసులు టిప్పర్ వాహనం డ్రైవర్ రాములపై కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్, మార్చి 14: ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన నిజామాబాద్, మాధవనగర్ కు చెందిన రాఘవేందర్‌రావు(60,)భార్య విజయలక్ష్మితో కలిసి దీప్తి శ్రీనగర్ కాలనిలో నివాసం ఉంటున్నాడు. వీరికి కుమార్తెలు ఉన్నారు. కాలనీలో విజయ స్వగృహ పుడ్స్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రాఘవేంద్రరావు మనుమడు అర్జున్ పుట్టిన రోజు కావడంతో సాయంత్రం వేడుకల నిమిత్తం కుటుంబసభ్యులందరూ కలిసి మధ్యాహ్నం సమయంలో పుట్టినరోజు షాపింగ్‌కు వెళ్లారు. రాఘవేందర్రావును కూడా రమ్మనగా నేను ఇంట్లోనే ఉంటానని తెలిపాడు. సాయంత్ర కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూడగా.. బెడ్ రూమ్ ఉరివేసుకొని కనిపించాడు. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే రాఘవేంద్రరావు మృతి చెంది ఉన్నాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కిందికి దించి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. గత కొంత కాలంగా రాఘవేంద్రరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, భరించలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇంకా ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గొలుసు దొంగ అరెస్ట్.. తులం బంగారం స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం చేసిన వ్యక్తి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14:జల్సాల కోసం బంగారు గొలుసును తస్కరించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, కేపీహెచ్‌బీ కాలనీ సీఐ రాజశేఖర్‌రెడ్డి గొలుసు దొంగతనం చేసిన వ్యక్తి వివరాలను వెల్లడించారు. ఈనెల 12న కేపీహెచ్‌బీ కాలనీ మూడవ రోడ్డు ఈడబ్ల్యూఎస్ 998లో అంజలి దంపతులు నివసిస్తున్నారు. కాగా, ఉదయాన్నే ఓ గుర్తు తెలియని వ్యక్తి మొదట అడ్రస్.. తర్వాత మంచినీళ్లు అడిగి.. ఆ మహిళ ఇంట్లోకి వెళ్లగానే వెనుక నుంచి వెళ్లి మెడలోని బంగారు గొలుసును తస్కరించి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా, ఆమె మెడలో బంగారు గొలుసును తస్కరించింది ఉప్పు సాయి తేజ(26)గా గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సాయితేజ.. కేపీహెచ్‌బీ కాలనీలో నివసిస్తూ రాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించి జల్సా చేయాలన్న ఆలోచనతో.. మహిళ మెడలో బంగారు గొలుసును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడు సాయి తేజను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతోపాటు అతడి వద్ద ఉన్న తులం బంగారు మంగళసూత్రం, సెల్ ఫోన్, ఒక పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని అభినందించి రివార్డ్‌లను అందజేశారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 14: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 23, కాకరకాయ 45, బీరకాయ 45, క్యాబేజి 10, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 45, చిక్కుడు 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 35, ఆలుగడ్డ 21, కీరా 13, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ (1) 15, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, చింతకాయ –, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 345, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని 45, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.